## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 6 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్, 11 కేవీ ఫతేదర్వాజ ఫీడర్, 11 కేవీ కంపెనీ బాగ్ ఫీడర్‌లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీఓ ప్రకటనలో తెలిపారు.

**ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..**

ఎన్ఆర్ఐ కాలనీ, కె.జి.ఎన్. హోటల్, ప్రశాంత్‌నగర్, బాపూఘాట్, పెన్షన్ పురా, లంగర్‌హౌస్ మార్కెట్, అంబేద్కర్ నగర్, లక్ష్మీనగర్, మిలిటరీ హాస్పిటల్, ఇందిరానగర్, ఫ్లోర్‌మిల్ ప్రాంతాలు

**మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..**

ఫతేదర్వాజ, ఛోటా బజార్, సెంట్రల్ బ్యాంక్, గోల్కొండ మ్యూజియం, పోస్టాఫీస్, 7 గల్లీ, బడా బజార్, ధాన్ కోట, సాలెనగర్ కంచ ప్రాంతాలు

**మధ్యాహ్నం 2 సాయంత్రం 5 గంటల వరకు..**

మోతి దర్వాజ, షాంగ్రిల్లా హైస్కూల్, అఫ్సర్ కాలనీ, కంపెనీ బాగ్, అహ్మద్ కాలనీ, బాగ్దాద్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

## మల్లేపల్లిలో అభివృద్ధి పనులు

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లోని బజార్‌ఘాట్‌లో బుధవారం సీవరేజీ లైన్ మరమ్మతు పనులను జలమండలి అధికారులు చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదేశాలతో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పరిశీలించారు. ఇక్కడ వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

- మెహిదీపట్నం

మహారాష్ట్రలోని ధులియా ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్ షా తరపున నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

# ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

ఆదర్శనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించిన జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతి, డీసీ విద్యాధర్

కుటుంబ సర్వేను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వివరిస్తున్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సర్వే నోడల్ అధికారి శైలజ

అబిడ్స్, నవంబర్ 6 : సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గోషామహల్ నియోజకవర్గం పరిధిలో ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ పద్నాల్గవ సర్కిల్‌లో ఉన్న 94000 కుటుంబాలు ఉండగా ఆయా కుటుంబాల్లో సర్వే నిర్వహించేందుకు గాను 520 మంది ఎన్యుమరేటర్ల ద్వారా ఈ సర్వే నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు ఇంటింటికీ తిరిగి ఈ సర్వేను చేపట్టనున్నారు. పద్నాల్గవ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ పర్యవేక్షణలో నోడల్ అధికారి శైలజ వ్యవహరిస్తున్నారు. మొదటి రోజు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేటర్లు స్టిక్కరింగ్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. మరో రెండు రోజులు స్టిక్కరింగ్ చేసిన తర్వాత ఇంటింటికి తిరిగి 56 ప్రధాన ప్రశ్నలతో పాటు అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని నోడల్ అధికారి శైలజ ప్రజలను కోరారు. ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఓ సూపర్ వైజర్ ఉంటారని ఆమె వివరించారు. మంగళ్‌హాట్ డివిజన్‌లో ఎఎంసీ, నోడల్ అధికారి శైలజ గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను కలిసి సర్వే గురించి వివరించారు.

### ఆదర్శనగర్‌లో పర్యటించిన జడ్సీ

గోషామహల్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పర్యటించి నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. జీహెచ్ఎంసీ పద్నాల్గవ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి పర్యటించి పలు సూచనలు సలహాలు చేశారు.

జన, కుల గణనలో భాగంగా గుడిమల్కాపూర్ డివిజన్ ఉప్పర్ బస్తీలో కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందితో కాంగ్రెస్ నాయకుడు నాగారం వేణు గౌడ్, బాలాజీ - కార్వాన్

# సమస్యలను పరిష్కరించాలి

జలమండలి జీఎంకు సమస్యలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, నవంబర్ 6 : గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌నకు వినతిపత్రం సమర్పించారు. గౌలిగూడలో వాటర్‌వర్క్స్ ఎండీ పాదయాత్ర చేసిన సమయంలో అక్కడ ఉన్న సమస్యలను జీఎం దృష్టికి తీసుకువెళ్లగా జగ్జీవన్‌రావు నగర్, సుభాన్ పురా, చార్ కందిల్, నమాజ్ గ్రౌండ్, సుధా మెడికల్ హాల్ వీధి, జాంబాగ్, హిందీనగర్ ప్రాంతాల్లో సమస్యలను జీఎంకు వివరించడం జరిగిందని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరిస్తున్నందుకు గోషామహల్ నియోజకవర్గం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖైసర్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ గౌస్, షేక్ జహంగీర్, యూసఫ్ పటేల్, మౌలానా జహంగీర్ మహ్మద్ ఫడోస్, మహ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

అబిడ్స్, నవంబర్ 6 : వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ ఈడీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కొన్ని రోజులుగా బిల్లులను విడదల చేయాలని ఎండీని కోరితే పట్టించుకోక పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రవేశ పెట్టిన కాంట్రాక్టర్ల ఏఎంఎస్ టెండర్‌ను పొడిగించకుండా నిలిపివేసి గతంలోని విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు మహ్మద్ ఇర్ఫాన్, ప్రవీణ్ కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

## పోరాట ఫలితమే..డెడికేటెడ్ కమిషన్

ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ

కాచిగూడ, నవంబర్ 6 : బీసీల పక్షాన నిలబడి అలుపెరుగకుండా పోరాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోర్టులో వేసిన కేసు ఫలితంగానే తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుజ్జ సత్యం హాజరై మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల కల్పన కోసం కోర్టులో గెలిచిన మహోన్నత బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య అని పేర్కొన్నారు.

52 ఏండ్లుగా బీసీ సమస్యలపై 15 వేలకు పైగా ఉద్యమాలు చేసిన నాయకుడు కృష్ణయ్య అని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో తెలంగాణలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, జనార్దన్, నందగోపాల్, జయంతి, బాలయ్య ముదిరాజ్, పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

కాచిగూడ,నవంబర్ 6: ప్రభుత్వం కులగణన కోసం బీసీలకు ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందుకు జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని నివాసంలో మార్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు లభిస్తాయని గుజ్జ కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నందగోపాల్, రామారావుగౌడ్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గం నానల్ నగర్ డివిజన్ హకీంపేట్‌లో బుధవారం కుటుంబ సమగ్ర సర్వేను ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ సర్కిల్ -13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సర్వేలో పాల్గొని తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. - మెహిదీపట్నం

## నూతన నియామకం

ఒగ్గు సమత, బైరి అమరావతికి నియామక పత్రాలను అందజేస్తున్న స్వామి, తదితరులు

కాచిగూడ, నవంబర్ 6: తెలంగాణ పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ ఒగ్గు సమత, ప్రధాన కార్యదర్శిగా బైరి అమరావతి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వారికి అఖిల భారత తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి నిమామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పద్మశాలీలు రాజకీయంగా రాణించేందుకు జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపా, ప్రధాన కార్యదర్శి జగన్నాథం, కె.మురళి, రామచంద్రం, స్వప్న, రేఖ పాల్గొన్నారు.

## ఎంఈ, ఎంటెక్ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. రాములు తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ (ఏఐసీటీఈ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. మెమోలను రెండు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ. 800 చొప్పున చెల్లించి ఈ నెల 12 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి 14 లోగా కార్యాలయం లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www. osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

## నాణ్యత పాటించాలి

బండ్లగూడ : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. పీ అండ్ టీ కాలనీ బీ బ్లాక్‌లో రూ. 31లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సదర్

మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు బాబురావు యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, రవీంద్రనాథ్ యాదవ్, తదితరులు

కాచిగూడ,నవంబర్ 6: తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా యాదవ సోదరులు నిర్వహించే సదర్ పండుగను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి జీఓ విడుదల చేసినందుకు అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నింబోలిఅడ్డా కార్యాలయంలో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు బద్దుల బాబురావు యాదవ్,జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ... యాదవుల సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే సదర్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సదర్‌ను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడంలో కీలక పాత్ర వహించిన రాజ్యసభ సభ్యుడు అనీల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి ఐ.రమేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్, బాల మల్లేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు యాదవ్, కోశాధికారి డి.శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శులు రమేశ్ యాదవ్, లడ్డూ యాదవ్, డి.శ్రీనివాస్‌యాదవ్, మహేందర్ యాదవ్, విజయ్ యాదవ్ మనీశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, : ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. ఫిజిక్స్ విభాగం అందిస్తున్న ఈ కోర్సులో చేరేందుకు ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో 60శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. ఎంట్రన్స్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను 11వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు స్వీకరిస్తామ న్నారు. ప్రవేశ పరీక్షను వచ్చే నెల 14న నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు www. ouadmissions.com, వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ మహ్మద్ మాజిద్, సీఐ టి. కిరణ్‌కుమార్, ఎస్సై మహేశ్ సూచించారు. నిబంధనలు పాటించని వాహనాదారులకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఎడ్యుకేషన్ వ్యాన్‌కు నిబంధనలను వివరించే బ్యానర్ ఏర్పాటు చేసి టీటీఐ సిబ్బందితో కలిసి ఏఆర్ చౌరస్తా వద్ద అవగాహన కల్పించారు. పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు.

- తెలుగు యూనివర్సిటీ

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మెహిదీపట్నం రేతిబౌలి సమీపంలో లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రాంగ్‌రూట్ ప్రయాణం,హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపిస్తున్న వారిపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించడమే కాకుండా నిబంధనలను పాటించని వారికి గులాబీలు ఇచ్చి చలానాలు విధించారు.

- మెహదీపట్నం

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న టీజీఎంఎస్ఐడీసీ ఏఈ హరీశ్, చిత్రంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ, వైద్యులు, సిబ్బంది

సుల్తాన్‌బజార్,నవంబర్ 6. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖా న సూపరింటెండెంట్ డాక్టర్ జాలెం అనురాధ అన్నారు. ఈ మేరకు టీజీఎంఎస్ఐడీసీ ఏఈ హరీశ్ ఆధ్వర్యంలో దవాఖాన ఆవరణలో అగ్ని ప్రమాద మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. దవాఖాన వైద్యులు, సిబ్బందికి ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా నివారించాలి, రోగులను ఎలా కాపాడాలనే అంశాలపై అవగాహనను కల్పించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. బిజీగా ఉండే వైద్యులు, సిబ్బందికి అవగాహన మాక్ డ్రిల్ ప్రమాదం పొంచిఉన్న సమయంలో ఉపయోగపడుతుందన్నారు.

అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఉపయోగించే పరికరాలైన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, ఫైర్ అలారం, ఫైర్ సిలిండర్ మిషన్లు, సరిపడా నీరు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టీజీఎంఎస్ఐడీసీ హరీశ్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించామన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో నాటి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి చొరవతో జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లక్ష్మి, వైద్యులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ స్వప్న, డాక్టర్ నిషిత, దవాఖాన సిబ్బంది బాలరాజు, సాయి, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## బొడ్రాయికి భూమి పూజ

అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట ప్రధాన రహదారిలో గాంధీబొమ్మ ఎదురుగా ఉన్న స్థలంలో అంబర్‌పేట బొడ్రాయి(నాభి శిల) భూమి పూజను దేవస్థాన సేవా సమితి ముఖ్య సలహాదారుడు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడు వై.శంకర్ గౌడ్, చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, బొడ్రాయి పునఃనిర్మాణ కమిటీ కన్వీనర్ సి.శ్రీనివాస్ ముదిరాజ్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హాజరయ్యారు.

- అంబర్‌పేట

## అయ్యప్ప స్వామి పడి పూజ

జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలు చేశారు. అనంతరం ఆశీష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి పడి పూజలతో ప్రజల్లో భక్తి భావం పెంపొందుతుందన్నారు.

- అబిడ్స్

## బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న మేయర్

ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన బర్త్‌డే వేడుకల్లో పిర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, కార్పొరేటర్ నవీన్ రెడ్డి, పన్నెండవ వార్డు సభ్యులు రాజరాజు, వాసు రెడ్డి పాల్గొన్నారు. మలుగ ఉదయ్‌కుమార్, సుష్మితల కూతురు వమిక పుట్టినరోజు వేడుకల్లో వారు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. - అబిడ్స్